సాక్షి
గుంటూరు
గురువారం, 24, అక్టోబర్, 2024




వైభవంగా కళ్యాణోత్సవం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో బుధవారం స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని కల్యాణం నిర్వహించారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 31,269 క్యూసెక్కులు వస్తోంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం 44.38 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 5,009, హై లెవల్ కాలువకు 226, బ్యాంక్ కెనాల్‌కు 1,356 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం లోక కళ్యాణార్థం లక్ష బిళ్వార్చన నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన శృంగేరిపీఠం అస్థుల పరిరక్షణాధికారి వేమూరి రామం ఆధ్వర్యంలో తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి, రుద్ర హోమం నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు చేశారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ , ఆలయ ఈవో వేమూరి గోపీనాథశర్మ, భక్తులు పాల్గొన్నారు.

అమరేశ్వరాలయం ఈఓగా సునీల్‌కుమార్



అమరావతి: ప్రసిద్ధి చెందిన అమరావతి అమరేశ్వరాలయానికి నూతన కార్యనిర్వహణ అధికారిగా బుధవారం కె. సునీల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఈవో వేమూరి గోపీనాథశర్మ బదిలీల్లో నెల్లూరు జిల్లా నరసింహకొండ ఈఓగా నియమితులయ్యారు. సునీల్ కుమార్ ప్రస్తుతం కంఠంరాజు కొండూరు దేవస్థానం ఈఓగా పనిచేస్తున్నారు. ఆయన్ను అమరావతి అమరేశ్వర ఆలయ ఇన్‌చార్జి ఈఓగా నియమించారు.

తప్పిపోయిన విద్యార్థులు కన్నవారికి అప్పగింత



పిడుగురాళ్ల: ఇద్దరు విద్యార్థులు పారిపోయి పిడుగురాళ్లలో ఉండగా గుర్తించిన పట్టణ పోలీసులు... వారిని కన్నవారికి అప్పగించిన సంఘటన బుధవారం జరిగింది. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు పట్టణంలోని నగరంపాలెంకు చెందిన 6వ తరగతి విద్యార్థులు షేక్ అబ్దుల్ ఖాదర్, సయ్యద్ మహ్మద్ నిహార్‌లు స్కూల్ యూనిఫాంలో పుస్తకాల బ్యాగ్‌తో పిడుగురాళ్ల పట్టణంలో తిరుగుతూ కనిపించారు. అనుమానం వచ్చి పట్టణ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఇంట్లో నుంచి పారిపోయి వచ్చినట్లు గుర్తించారు. వెంటనే అబ్దుల్ ఖాదర్ తండ్రి ఖాదర్ మస్తాన్, సయ్యద్ మహ్మద్ నిహార్ తండ్రి ఆలీ బాషాలను పిడుగురాళ్ల పిలిపించారు. వారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

ఫ్లై ఓవర్ పైనుంచి కింద పడిన కారు

ఒకరు మృతి, ఇరువురికి గాయాలు



గుంటూరు రూరల్: నగర శివారు జాతీయ రహదారి బుడంపాడు ఫ్లైఓవర్‌పై బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. విజయవాడ నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న కారు అదుపు తప్పి కిందకు బోల్తా కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన కొండపోగు అంకమ్మరావు (32) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న డ్రైవర్ షేక్ మౌలాలి, మరొక వ్యక్తి షేక్ నజీర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరు ముగ్గురు సత్తుపల్లి వెళ్లి డ్రోన్ కెమెరా రిపేర్ చేయించుకుని చిలకలూరిపేట సమీపంలోని తమ గ్రామానికి బయలుదేరారు. తెల్లవారుజామున సుమారు మూడు గంటల సమయంలో కారు వేగంతో అదుపుతప్పి రిటైనింగ్ వాల్‌ను ఢీకొంది. అదే వేగంతో సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. స్థానికులు రుద్ర ట్రస్ట్ సిబ్బంది సహకారంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతులు ఆర్గానిక్ సర్టిఫికెట్ తీసుకోవాలి

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు ఆర్గానిక్ సర్టిఫికెట్ తీసుకోవాలని డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీఎం అమలకుమారి, రాష్ట్ర రీసోర్స్ పర్సన్ మాధవి, జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు పాల్గొన్నారు.



గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జన సందోహానికి అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సహానా మృతదేహం వద్ద విషణ్ణ వదనంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆడబిడ్డలకు అండ

మహిళల రక్షణలో ప్రభుత్వం ఘోరంగా విఫలం : మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అఘాయిత్యాలలో బలైన యువతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున సాయం

- టీడీపీ గూండాల చేతిలో బలైన సహానా కుటుంబానికి జననేత పరామర్శ
- గుంటూరులో అధినేతకు మద్దతుగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నిందితుడికి టీడీపీతో సంబంధాలు ఉన్నందునే రక్షిస్తున్నారని ఆరోపణ
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టీకరణ



సహానా మృతదేహంపై గాయాలను పరిశీలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, గుంటూరు, పట్నంబజారు: రాష్ట్రంలో హత్యాచార బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. టీడీపీ గూండాల చేతిలో బలైన ఆడబిడ్డ కుటుంబానికి తానున్నానే భరోసా కల్పించేందుకు బుధవారం గుంటూరు వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ కార్యకర్తలు, ప్రజానీకం, కులసంఘాల నేతలు మద్దతుగా నిలిచారు. ఆడపడుచుకు సోదరుడిగా .. సదరు నిందితులను నిలదీసిన జననేత పక్షాన తామున్నామని గొంతెత్తి చాటారు. గుంటూరు జీజీహెచ్‌లో సహానా మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబసభ్యులను వైఎస్ జగన్ ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన ఏడు హత్యాచార ఘటనల్లో చంద్రబాబు స్పందించినా లేకపోయినా, తమ పార్టీ నుంచి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. దీంతో పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడు నవీన్ దాడిలో చనిపోయిన తెనాలి యువతి సహానా, రెండు నెలల క్రితం చేబ్రోలులో హత్యకు గురైన శైలజ, వేటపాలెం మండలంలో హత్యకు గురైన సుచరిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ తరఫున రూ. 10 లక్షల వంతున ఆర్థిక సాయం అందనుంది. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన జరుగుతోందని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ వారు ఏ తప్పు చేసినా వెనకేసుకొచ్చేలా చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రాబోయేది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ విధంగా దాడులకు, అత్యాచారాలకు పాల్పడిన వారిని వెతికి మరీ జైళ్లకు పంపుతామని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. సహానాను పని చేస్తున్న ప్రదేశానికి వచ్చి కారులో నవీన్ ఎక్కించుకెళ్లి ఇంకొందరితో కలిసి వేధించాడని, శారీరకంగా హింసించారని తెలిపారు. ఆమె శరీరమంతా కందిపోయిన గుర్తులు కనిపిస్తున్నాయని, ప్రైవేటు పార్ట్‌లూ విచ్ఛిన్నం చేసినట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఇక్కడికి తీసుకొచ్చి పడేసి, కుటుంబ సభ్యులు రాగానే జారుకున్నారని తెలిపారు. ఈ విషయాలను పోలీసులు ఎందుకు దాచి పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. నవీన్‌తోపాటు ఉన్న మరో ఇద్దర్ని ఎందుకు అదుపులోకి తీసుకోవడం లేదని వైఎస్ జగన్ మండిపడ్డారు. తాను దళితులకు తోడుగా ఉంటానని, దళితులంతా తమ వారే అని పేర్కొన్నారు. తాను ఈ విషయాన్ని ధైర్యంగా చెబుతానని స్పష్టం చేశారు. పేదలకు తోడుగా ఉన్నామని ప్రభుత్వం చెప్పాలిగానీ, కూటమి సర్కారు మాత్రం ఆ పని చేయడం లేదన్నారు. పైగా తమ పార్టీ వారిని నిందించడం సరైనదేనా? అని నిలదీశారు. సహానా తల్లికి తాము తోడుగా నిలబడితే.. తమపై నిందలు వేయడం సబబా? అంటూ జగన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన వెంట టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, వరుదు కళ్యాణి, కల్పలతారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, వైఎస్సార్ సీపీ గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, కోన రఘుపతి, నంబూరు శంకరరావు, పార్టీ నగర అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్, పార్టీ నేత మేకతోటి దయాసాగర్ ఉన్నారు.

జననేతకు మద్దతుగా...

తొలుత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో బుధవారం ఉదయం 10.50 గంటలకు గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌కు చేరుకున్నారు. అప్పటికే పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా.. ముందుకు సాగారు. గుంటూరు జిల్లా కోర్టు మీదుగా వెళుతూ న్యాయవాదులు అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు. మెడికల్ కళాశాల మీదుగా ఆసుపత్రికి చేరుకున్నారు. వైఎస్ జగన్‌కు మద్దతు తెలిపేందుకు పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, పలు దళిత సంఘాల నేతలు అక్కడకు చేరుకున్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీ వద్దకు వైఎస్ జగన్ చేరుకునే సరికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. సహానా మృతి గురించి జీజీహెచ్‌లో వైద్యులతో వైఎస్ జగన్ మాట్లాడారు.



వైద్యులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న వైఎస్ జగన్

వేధింపులు.. కక్ష సాధింపులు

వైఎస్సార్ సీపీలోని దళితులు, బలహీన వర్గాలే టార్గెట్

- బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై కేసుల పరంపర
- వేమూరులో అశోక్‌బాబుపై కేసులు
- యద్దనపూడిలో ఎస్సీలపై రౌడీషీట్లు
- రేపల్లెలో దళిత నేతలపై దాడులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు టార్గెట్‌గా తెలుగుదేశం ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోంది. దాడులకు తెగబడడంతోపాటు అక్రమ కేసులు బనాయిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలను టార్గెట్ చేసి వేధింపులకు గురిచేస్తున్నారు.


అశోక్‌బాబుపై అక్రమ కేసులు..

టీడీపీ అధికారంలోకి వచ్చాక వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం అద్దేపల్లి ఎస్సీ కాలనీలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని పచ్చపార్టీ వారు పెట్రోల్ పోసి తగులబెట్టారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు కాలనీ వద్దకు చేరుకొని అధికారపార్టీ నేతల తీరును ఖండించారు. కళ్లకు నల్లబ్యాడ్జీ కట్టుకొని నిరసన దీక్షకు దిగారు. ఆయనకు పెద్దఎత్తున మద్దతు లభించింది. వేలాదిమంది కార్యకర్తలు మద్దతుగా రావడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అశోక్‌బాబుతో పాటు పలువురిపై అక్రమ కేసులు నమోదు చేశారు. చివరకు వైఎస్ విగ్రహం స్థానంలో అశోక్‌బాబు మరొక విగ్రహం ఏర్పాటు చేశారు.

ఎస్సీ నేతలపై రౌడీషీట్లు..

పర్చూరు నియోజకవర్గం యద్దనపూడి మండలానికి చెందిన పలువురు ఎస్సీ నేతలపై పచ్చ ప్రభుత్వం రౌడీషీట్లు ఓపెన్ చేసి కక్షపూరితంగా వ్యవహరించింది. మండలానికి చెందిన పర్చూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలెపోగు రాంబాబు వైఎస్సార్ సీపీలో చురుకైన నేతగా ఉన్నారు. పచ్చపార్టీ ఆధిపత్యం ఉన్న నియోజకవర్గంలో ఎస్సీ సామాజికవర్గాన్ని సమన్వయం చేసి వైఎస్సార్ సీపీకి మద్దతుగా కూడగట్టారు. నియోజకవర్గంలో దళిత వేదిక ఏర్పాటు చేసి వారికి అండగా ఉన్నారు. ప్రభుత్వం రాంబాబుతోపాటు ఆయన సామాజికవర్గం వారు ఏడుగురిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి బెదిరింపులకు దిగింది. చురుగ్గా ఉన్న బలహీన వర్గాలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తే వారు వైఎస్సార్ సీపీకి దూరంగా ఉంటారన్నది పచ్చపార్టీ ఎత్తుగడగా ఉంది. కానీ వారు ఏమాత్రం బెదరడంలేదు. అక్రమ కేసులు బనాయించడమే కాకుండా మరోవైపు పచ్చనేతలు వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నేతలపై ఏకంగా దాడులకు తెగబడిన సంఘటనలు కోకొల్లలు.

- రేపల్లె నియోజకవర్గం చెరకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెంకు చెందిన దళిత నాయకుడు రాజ్‌కుమార్ ఇంటిపై దాడిచేసి తీవ్రంగా కొట్టి గాయపరిచారు. ఇంటిఅద్దాలు ధ్వంసం చేశారు. ఊరు విడిచిపెట్టి వెళ్లాలని బెదిరించారు.
- ఇదే మండలం గుళ్లపల్లికి చెందిన మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు డ్రైవర్ గాలి సంపత్‌కుమార్ అనే దళితుడిని ఇంటిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అంతు తేలుస్తామంటూ బెదిరించారు. జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన దళిత నేతలు, కార్యకర్తలను పచ్చనేతలు బెదిరించడంతోపాటు దాడులు చేసి కొట్టిన సంఘటనలతోపాటు అక్రమ కేసులు బనాయించిన ఘటనలు అనేకం.



బయటకు రాకుండా నందిగంపై కుట్ర

బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను చంద్రబాబు ప్రభుత్వం టార్గెట్ చేసింది. కేసులు బనాయించి హింసిస్తోంది. సురేష్‌ను జైలుకు పంపిన ప్రభుత్వం మరిన్ని కేసులు పెట్టి బయటకు రాకుండా చేసే కుట్రకు తెరలేపింది. అనారోగ్యంతో ఉన్న ఆయనకు సక్రమంగా వైద్య సేవలు అందించక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగిన సురేష్‌పై ప్రభుత్వం ఇలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలను సర్కార్ నిత్యం వేధిస్తోంది.

భద్రత శూన్యం.. పర్యవేక్షణ ప్రహసనం

- బాలికలను మాయమాటలతో బయటకు తీసుకెళుతున్న పోకిరీలు
- గుంటూరులోని రెండు హాస్టళ్లలో ఇదే తరహా ఘటనలు
- కేసులు నమోదైనప్పటికీ బాధ్యులపై నామమాత్రపు చర్యలు
- కొన్నిచోట్ల మహిళా వార్డెన్‌ల భర్తలు హల్‌చల్ చేస్తున్న వైనం



జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించిన కార్యాలయం

నెహ్రూనగర్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో కొరవడిందనే చెప్పాలి. ఇందుకు నిదర్శనం నెల రోజుల క్రితం గుంటూరు నగరంలో రెండు సంక్షేమ హాస్టల్స్‌లో జరిగిన ఘటనలే. అక్కడి విద్యార్థినులకు మాయమాటలు చెప్పిన కొందరు బయటకు తీసుకువెళ్లడంతో దుమారం రేగింది. దీనిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చెలరేగాయి. అధికారులు మాత్రం దిద్దుబాటు చర్యల్లో భాగంగా మెమోలు ఇవ్వడంతోపాటు చిన్న స్థాయి సిబ్బందిని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు.

ఇవీ నిదర్శనాలు...

గుంటూరు నగరంలో జూట్ మిల్ వద్ద ఉన్న ఎస్సీ కాలేజీ బాలికల హాస్టల్‌లో ఒక విద్యార్థినిని ఓ ఆకతాయి మాయమాటలు చెప్పి ఒక రోజంతా బయటకు తీసుకువెళ్లాడు. సదరు విద్యార్థిని కనపించకపోవడంతో వార్డెన్ పోలిసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేశారు. అదే విధంగా స్టాల్ గరల్స్ కాంపౌండ్‌లోని బీసీ ప్రీ మెట్రిక్ (చిన్న పిల్లల) హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థినిని మరొక పోకిరీ మాయమాటలు చెప్పి బయటకు తీసుకువెళ్లాడు. దీనిపై తోటి విద్యార్థినిని వార్డెన్‌కు ఫిర్యాదు చేయడంతో.. దీనిపైనా కేసు నమోదైంది. ఎస్టీ బాలికల హాస్టల్‌లో కూడా ఇలాంటే సంఘటనలు జరుగుతున్నప్పటికీ వాటిని అధికారులు గోప్యంగా ఉంచుతున్నారని సమాచారం. ఇవన్నీ హాస్టల్ సిబ్బంది సహకారంతోనే జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

హాస్టల్స్‌లో జరుగుతున్న విషయాలను తెలుసుకున్న ఎమ్మెల్యే గల్లా మాధవి స్వయంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని పలు బాలికల హాస్టల్స్‌ను పరిశీలించారు. వాటి నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. వాటిని కప్పిపుచ్చుకోవడానికి ఎస్సీ హాస్టల్ వార్డెన్‌కు మెమో, బీసీ హాస్టల్ పని చేసే అవుట్ సోర్సింగ్ మహిళా ఉద్యోగినిని విధుల నుంచి తొలగించారు. ఇక ఈ విషయాలు బయటకు రానివ్వకుండా కవర్ చేయడానికి సంక్షేమ హాస్టల్స్‌కు చెందిన ఉన్నతాధికారులు భారీ మొత్తంలో వార్డెన్స్ నుంచి మామూళ్లు తీసుకున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

వార్డెన్ల భర్తల తీరుపైనా ఆరోపణలు

జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ బాలికల హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న మహిళ వార్డెన్స్‌తో వారి భర్తలు కూడా వస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నేరుగా బాలికల రూముల్లోకి వారు వెళుతుంటారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ విషయాలన్నీ తెలిసినా అధికారులు మాత్రం మూముళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకోవాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు. తమ పిల్లల భద్రతపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల సమాచారం

హాస్టల్ పేరు	సంఖ్య	బాలికలు	బాలురు
ఎస్సీ హాస్టళ్లు			
కాలేజీ బాలికల హాస్టల్	6	800	-
కాలేజీ బాయ్స్ హాస్టల్	10	-	723
ప్రీ మెట్రిక్ బాయ్స్ హాస్టల్	10	-	400
ప్రీ మెట్రిక్ బాలికల హాస్టల్	8	580	-
ఎస్టీ హాస్టళ్లు			
కాలేజీ బాలికల హాస్టల్	1	102	-
కాలేజీ బాయ్స్ హాస్టల్ (1)	1	-	125
కాలేజీ బాయ్స్ హాస్టల్ (2)	1	-	29
ప్రీ మెట్రిక్ బాలికల హాస్టల్	1	155	-
రెసిడెన్షియల్ స్కూల్ బాయ్స్ హాస్టల్	2	-	146
రెసిడెన్షియల్ స్కూల్ బాలికల హాస్టల్	1	140	-
బీసీ హాస్టళ్లు			
కాలేజీ బాయ్స్ హాస్టల్	8	-	467
కాలేజీ బాలికల హాస్టల్	8	636	-
ప్రీ మెట్రిక్ బాయ్స్ హాస్టల్	10	-	700
ప్రీ మెట్రిక్ బాలికల హాస్టల్	4	376	-

నేటి నుంచి ఏఎన్‌యూ యువజనోత్సవాలు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల యువజన ఉత్సవాలు ఈ నెల 24, 25, 26వ తేదీలలో జరుగుతాయని రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం బుధవారం తెలిపారు. 30 అంశాలలో విద్యార్థులు కళాప్రదర్శన చేయనున్నారని చెప్పారు. గురువారం ప్రారంభోత్సవ సభకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా, పారిశ్రామికవేత్త డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొననున్నారని తెలిపారు. ప్రత్యేక అతిథులుగా రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి, వర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. యువజనోత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. వర్సిటీలోని వికాస భవన్, విద్యార్థి కేంద్రం, హిస్టరీ విభాగంలోని సెమినార్ హాల్, ఓపెన్ థియేటర్, బాలమోహన్ దాస్ సెమినార్ హాల్‌లో పోటీలు జరుగుతాయన్నారు.

షెడ్యూల్ ఇదీ..

గురువారం మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటల్ సోలో, ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్టర్న్ ఒకల్ సోలో, గ్రూప్ సాంగ్ పోటీలు, మిమిక్రీ, మైమ్‌లోను పోటీలు ఉంటాయి. ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో స్పాట్ పెయింటింగ్, పోస్టర్ మేకింగ్, క్లాసికల్ డాన్స్, క్విజ్ పోటీలు జరుగుతాయి.

- 25న మ్యూజిక్ విభాగంలో క్లాసికల్ వోకల్ సోలో (హిందుస్తానీ, కర్ణాటక), లైట్ ఒకల్ సోలో, గ్రూప్ సాంగ్స్, డిబేట్, క్విజ్ పోటీలు ఉంటాయి. ఫైనార్ట్స్ విభాగంలో కొల్లేజ్, క్లే మోడలింగ్, ఇన్‌స్టాలేషన్, మెహిందీ పోటీలు జరుగుతాయి.
- 26వ తేదీన ఫోక్ ట్రైబల్ డాన్స్, స్కిట్స్, ఎలక్యూషన్, రంగోలి, కార్టూనింగ్, స్పాట్ ఫొటోగ్రఫీ అంశాల్లో పోటీలు జరుగుతాయి.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,000 గరిష్టం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,500

క్లుప్తంగా

యార్డుకు 31,357 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 31,357 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,340 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,200 నుంచి రూ. 16,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ.18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 26,629 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేపు రెజ్లింగ్ జట్టు ఎంపికలు

అచ్చంపేట: పల్నాడు జిల్లా స్థాయి రెజ్లింగ్(కుస్తీ) ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి గుడిపూడి భూషణం బుధవారం తెలిపారు. పల్నాడు జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్(కుస్తీ)అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 2005కు ముందు జన్మించినవారై ఉండాలని, ధ్రువీకరణ పత్రం, ఆధార్ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకురావాలన్నారు. ఎంపికైన విద్యార్థులు నవంబర్ 9,10 తేదీలలో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు.

న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చిన లక్ష్మణరావు



అంబటి లక్ష్మణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జస్టిస్ కేజీ శంకర్, కేఎస్ లక్ష్మణరావు, రామ్ పాపారావు, రామచంద్రరాజు, బొమ్మిడాల కృష్ణమూర్తి తదితరులు

ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్

గుంటూరు ఎడ్యుకేషన్: వివాదాలకు దూరంగా వృత్తి ధర్మాన్ని పాటించిన అంబటి లక్ష్మణరావు న్యాయ వ్యవస్థకు వన్నె తెచ్చిన ఆదర్శనీయుడని ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్ పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో బుధవారం అలహాబాద్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి దివంగత అంబటి లక్ష్మణరావు సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కేజీ శంకర్ మాట్లాడుతూ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా 37 ఏళ్లపాటు నిజాయితీగా పని చేసిన అంబటి లక్ష్మణరావు పదవీ విరమణ అనంతరం 28 ఏళ్లపాటు సామాజిక సేవ చేసిన మహనీయుడని కొనియాడారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 75 ఏళ్లలో భారత న్యాయవ్యవస్థ స్వర్ణయుగంలో ప్రమాణాలు నెలకొల్పిన న్యాయమూర్తుల్లో జస్టిస్ లక్ష్మణరావు ఒకరని ప్రశంసించారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో జస్టిస్ అంబటి లక్ష్మణరావుతో కలిసి పనిచేసే అవకాశం తనకు దక్కిందని తెలిపారు. రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్రరాజు మాట్లాడుతూ జస్టిస్ లక్ష్మణరావు విలువలతో కూడిన నిరాడంబర, సంపూర్ణమైన జీవితాన్ని గడిపారని, ఆయన అందించిన స్ఫూర్తి ఎప్పటికీ నిలిచిపోతుందన్నారు. లక్ష్మణరావు తనయుడు డాక్టర్ రామ్ పాపారావు మాట్లాడుతూ నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం, తాను నమ్మిన ఆశయాల అమలు కోసం కృషి చేసిన తమ తండ్రి సంస్మరణ సభను ఈనెల 27న హైదరాబాద్ జలవిహార్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత అంబటి లక్ష్మణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి, మేకల రవీంద్రబాబు, ఉగ్గిరాల సీతారామయ్య, విశ్రాంత ఎస్పీ చక్రపాణి, దాసరి రాము, ఆళ్ల హరి, ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, పి.ఉమామహేశ్వరరావు, సోనా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏఐపై అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

డాక్టర్ రమేష్ కన్నెగంటికి తెనాలిలో ఆత్మీయ సత్కారం



డాక్టర్ రమేష్‌ను సత్కరించిన డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి

తెనాలి: హైదరాబాద్ కేంద్రంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై పనిచేస్తున్న ఏకైక 'మానవ రక్షణ అధ్యయన సంస్థ' (సీహెచ్‌ఎస్ఎస్) వ్యవస్థాపకుడు/ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కన్నెగంటి రమేష్‌కు అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం లభించింది. ఆ యూనివర్సిటీ హ్యూమన్ సెంటర్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (హెచ్ఏఐ) ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీనుంచి మూడురోజులపాటు జరగనున్న ఈ సదస్సు ప్రత్యేకించి కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు సంబంధించినది. కృత్రిమ మేధతో స్మార్ట్ పోలీసింగ్, ఓడరేవుల రక్షణ అంశంపై రూపొందించిన ప్రోగ్రాంతో ప్రపంచవ్యాప్తంగా 30 సంస్థలు పాల్గొంటున్న ఆ సదస్సుకు భారత్ నుంచి ఆహ్వానం అందుకున్న ఏకైక సంస్థ సీహెచ్ఎస్ఎస్ ఎన్జీవో.

డాక్టర్ రమేష్‌కు ఆత్మీయ సత్కారం

ఈసందర్భంగా బుధవారం డాక్టర్ రమేష్‌కు జన్మస్థలి తెనాలిలో ఆత్మీయ సత్కారం చేశారు. స్థానిక ముత్యంశెట్టిపాలెంలో ప్రవాస భారతీయుడు, ప్రముఖ మానసిక వైద్యుడైన డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి చేతులమీదుగా ఈ సత్కారం చేశారు. నానాటికీ విస్తరిస్తున్న టెక్నాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కు ఇప్పుడు ప్రాధాన్యత పెరిగిందని డాక్టర్ బాబు గుర్తుచేశారు. భవిష్యత్ ప్రాధాన్యతలను గుర్తెరిగి ఏఐలో అద్భుతమైన కార్యక్రమం రూపకల్పన చేసిన డాక్టర్ కన్నెగంటి రమేష్ అభినందనీయుడుగా చెప్పారు. సత్కార గ్రహీత డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, థింక్ ట్యాంక్‌గా పనిచేస్తున్న తమ సంస్థ విద్య, వైద్యం, అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలు అంశాలపై లాభాపేక్ష లేని ఎన్జీఓగా పనిచేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో 'అరసం' జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్‌హకీంజాని, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ కన్నెగంటి గోపీచంద్, న్యాయవాది పొన్నం విజయకుమార్, కంచర్ల వెంకటేశ్వరరావు, మణికుమార్, శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

28న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 28న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతో పాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు.

సమావేశాలు జరిగే ప్రాంతాలు..

- గుంటూరు జిల్లా: పేరేచర్లలోని జోసిల్ కంపెనీ
- పల్నాడు జిల్లా: చిలకలూరిపేటలోని సెయింట్ జేవీయర్స్ గ్లోబల్ స్కూల్
- బాపట్ల జిల్లావాసులకు: పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రు గ్రామంలోని డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం స్కూల్
- కృష్ణాజిల్లా: బాపులపాడు మండలం రేమల్లె గ్రామంలోని మోహన్ స్పింటెక్స్ ఇండియా లిమిటెడ్
- ఎన్టీఆర్ జిల్లా: విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలోని ఆయుష్ ఎన్నారై ఎల్ఈపీఎల్ హెల్త్‌కేర్
- ప్రకాశం జిల్లా: పొదిలిలోని వివేకానంద జూనియర్ కళాశాల

ప్రైవేటు వసతి గృహంలో చోరీ

- 5 ల్యాప్‌టాప్‌లు, 4 సెల్‌ఫోన్లు మాయం
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన తుళ్లూరు పోలీసులు

తాడికొండ: తుళ్లూరు మండలం ఐనవోలు గ్రామంలో సూర్య ప్రైవేటు వసతి గృహంలో ఐదు ల్యాప్‌టాప్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు దొంగిలించారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు ఎస్ఐ జి.అంకమ్మ తెలిపారు. వీఐటీ ఏపీ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులకు చెందిన ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాలీబాల్ విజేతలు చిత్తూరు, గుంటూరు

- రాష్ట్రస్థాయి అండర్–17 బాలుర పోటీల్లో గుంటూరుపై చిత్తూరు గెలుపు
- బాలికల విభాగంలో చిత్తూరుపై విజయం సాధించిన గుంటూరు జట్టు



బాలికల విభాగంలో మొదటి స్థానం దక్కించుకున్న గుంటూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముదిరెడ్డిపల్లిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల వాలీబాల్ టోర్నీ విజేతగా చిత్తూరు, గుంటూరు జట్లు నిలిచాయి. మూడు రోజులపాటు సాగిన ఈ పోటీలు బుధవారం ముగిశాయి. చివరి రోజు బుధవారం బాలుర విభాగం సెమీఫైనల్స్ జరిగాయి. ఇందులో విశాఖపై గుంటూరు, శ్రీకాకుళంపై చిత్తూరు జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. అనంతరం హోరీహోరీగా సాగిన ఫైనల్ పోటీలో గుంటూరుపై చిత్తూరు జట్టు గెలిచి మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో విశాఖ, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచాయి.

బాలికల విజేత గుంటూరు..

బాలికల విభాగంలో అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు జట్లు సెమీఫైనల్‌కు చేరుకోగా, తొలి సెమీఫైనల్‌లో ప్రకాశంపై చిత్తూరు జట్టు, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంపై గుంటూరు జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరుపై గుంటూరు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో అనంతపురం, నాల్గో స్థానంలో ప్రకాశం జట్లు నిలిచాయి. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, హెచ్ఎం సుధామణి, టోర్నీ అబ్జర్వర్ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ మొరార్జీ యాదవ్, ముదిరెడ్డిపల్లి వాసులు మంజునాథ్, బండారు బాలాజీ, మంచాల మారుతి, పల్లా లక్ష్మీ కుమార్, ఏసీ నాగరాజు, ఓబులేసు, పామిశెట్టి శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, పీఈటీలు రామాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సహానా మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

సహానా మృతదేహాన్ని పరిశీలించిన సీపీఐ నాయకులు



మృతురాలు సహానా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముప్పాళ్ల, జంగాల తదితరులు

లక్ష్మీపురం: టీడీపీ కార్యకర్త, రౌడీషీటర్ నవీన్ చేతిలో అత్యంత పాశవికంగా లైంగిక వేధింపులకు గురై, గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సహానా కుటుంబానికి సీపీఐ పూర్తి సహకారం అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సహానా కుటుంబాన్ని సీపీఐ నాయకులు బుధవారం పరామర్శించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ బాధిత సహానా మృతికి కారుకులైన నవీన్, అతని మిత్రులు, ఇతర నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతూ ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చొరవ తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత సహానా కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు అరుణ్ తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్ నవీన్‌ను కఠినంగా శిక్షించాలి

- సీఐటీయూ నాయకుడు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు
- తాడికొండలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

తాడికొండ: తెనాలిలో సహానా మృతికి కారకుడైన రౌడీషీటర్ రాగి నవీన్‌ను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, చింతల భాస్కరరావు, కనగాల పూర్ణచంద్రరావులు డిమాండ్ చేశారు. సహానా మృతిని నిరసిస్తూ తాడికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి నిందితుడిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని సమాజంలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను కఠినంగా అమలు చేయని కారణంగానే రాష్ట్రంలో సంఘ విద్రోహ శక్తులు, యువకులు రెచ్చిపోతున్నారని యువతి కుటుంబానికి న్యాయం జరిగేలా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం మానవ హారంగా నిలిచి రెండు నిముషాలు మౌనం పాటించారు. డి.శ్యామ్యూల్, రేపూడి శ్రీనివాసరావు, సంకూరి రాజు, షేక్ సుభాని, నూతక్కి వీరయ్య, కుక్కమళ్ళ జగ్జీవన్‌రామ్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

నర్సుల సంఘం అధ్యక్షురాలిగా కోటమ్మ


హోరాహోరీగా సాగిన ఎన్నికలు



కోటమ్మ, పద్మజ ప్యానల్‌ను అభినందిస్తున్న ఏపీ ఎన్జీఓ నేతలు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలిగా ఎస్.కోటమ్మ ఎన్నికయ్యారు. సెక్రటరీగా వెల్లంపల్లి పద్మజ, కోశాధికారిగా హేమలత, వైస్ ప్రెసిడెంట్‌గా శ్రీదేవి ఎన్నికయ్యారు. గుంటూరు జీజీహెచ్‌లో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నర్సుల సంఘం ఎన్నిక జరిగింది. హోరాహోరీగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి నర్సింగ్ సిబ్బంది ఓట్లు వేసేందుకు గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. ఎన్నికల ఫలితాల్లో ప్రారంభం నుంచి చివరి వరకు కోటమ్మ, పద్మజ ప్యానల్ అభ్యర్థులు ఆధిపత్యం చూపించారు. ఈసీ మెంబర్లుగా కోటమ్మ ప్యానల్‌లో పోటీ చేసిన సునీత, ఆశాలత అత్యధిక ఓట్లు పొంది రికార్డు సృష్టించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు ఆరేళ్ల తరువాత జరిగాయి. ఎస్.కోటమ్మకు 247 ఓట్లు పోలవ్వగా, ప్రత్యర్థిగా పోటీచేసిన శైలజకు 179 ఓట్లు పోలయ్యాయి. సెక్రటరీగా పోటీచేసిన వెల్లంపల్లి పద్మజకు 298 ఓట్లు రాగా, అరుణకు 127 ఓట్లు వచ్చాయి. వైస్ ప్రెసిడెంట్‌గా పోటీ చేసిన శ్రీదేవికి 311 ఓట్లు, కోశాధికారిగా పోటీ చేసిన హేమలతకు 257 ఓట్లు వచ్చాయి. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పోటీ చేసిన పుల్లగూర సునీతకు 308 ఓట్లు, ఆశాలతకు 305 ఓట్లు, ఉషారాణికి 229 ఓట్లు, భూలక్ష్మికి 271 ఓట్లు, అరుణకు 244 ఓట్లు వచ్చాయి. మొత్తం 487 ఓట్లు ఉండగా, 438 మంది అభ్యర్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 21 ఓట్లు చెల్లలేదు. శైలజ ప్యానల్ కూడా కోటమ్మ ప్యానల్‌కు గట్టి పోటీ ఇచ్చింది. ఎన్నికల అధికారిగా కో–ఆపరేటివ్ సొసైటీకి చెందిన తులసి బ్రహ్మమ్మ వ్యవహరించారు. ఎన్నికల్లో గెలుపొందిన కోటమ్మ, శైలజ ప్యానల్ అభ్యర్థులను ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, నగర సెక్రటరీ చింతల కళ్యాణ్, తదితర నేతలు అభినందించారు.

ఆలిండియా వాటర్ అవార్డుల్లో కేఎల్‌యూకు ద్వితీయ బహుమతి



కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ అఖిల భారత స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, జలవనరుల శాఖ, నదుల అభివృద్ధి మరియు గంగా పునరుజ్జీవన శాఖ ప్రకటించిన 5వ జాతీయ నీటి అవార్డులు 2023లో ఉత్తమ సంస్థల కేటగిరిలో కేఎల్‌యూ ద్వితీయ బహుమతిని గెలుచుకుందని అన్నారు. ఈ అవార్డు ప్రదానోత్సవం ఈనెల 22వ తేదీన న్యూఢిల్లీలోని న్యూ విజ్ఞాన భవన్‌లో జరిగిందని, కేంద్ర జలశక్తిమంత్రిత్వ శాఖ ప్రకటించిన ఈ ప్రతిష్టాత్మక పురస్కారం వివిధ వర్గాల్లో నీటి వనరుల నిర్వహణ, పరిరక్షణలో అత్యుత్తమ విజయాలను గుర్తిస్తుందన్నారు. కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్ చేతులమీదుగా తాము ఈ పురస్కారాన్ని అందుకున్నామని తెలిపారు. వర్సిటీ ప్రాంగణంలో, హాస్టళ్లలో డ్యూయల్ ప్లంబింగ్ సిస్టమ్స్, వర్షపు నీటి కోసం 28 ఇంకుడు గుంతలు, రెండు బావులు, ఐదు బోర్‌వెల్ ఇన్‌ఫిల్ట్రేషన్ సదుపాయాలు భూగర్భ జలస్థాయిలను మెరుగుపరిచేందు తాము ఏర్పాటు చేశామన్నారు. అదనంగా గంటకు 24,750 లీటర్ల మిశ్రమ వడపోత సామర్థ్యంతో 21 రివర్స్ అస్మాసిస్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశామన్నారు. క్యాంపస్‌లోని మురుగునీటి శుద్ధి కర్మాగారం నుంచి రీసైకిల్ చేయబడిన నీటిని యంత్రాలతో చిలకరించే వ్యవస్థ ద్వారా మొక్కలకోసం సమర్థవంతంగా వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. 550 సెన్సార్ ఆధారిత టాయిలెట్లు, సమర్థవంతమైన నీటి నిర్వహణను ప్రోత్సహించే 662 కంటే ఎక్కువ నీటి మీటర్ల ద్వారా మరింత రుజువు చేయబడిందని అన్నారు. ప్రో.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి.రాజేష్, అసోసియేట్ డీన్ కన్నెగంటి జ్యోతిష బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్, ఐసీఏఆర్ ఎన్ఏఏఆర్ఎంల మధ్య ఎంఓయూ



ఐసీఏఆర్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుతో అవగాహన పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్ వీసీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ – హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ – ఎన్ఏఏఆర్ఎమ్ (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్)ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు వీసీ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ – ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్, ఏ–ఐడియా ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాసరావుతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. వీసీ నాగభూషణ్ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం వలన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్, అకడమిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్, ఫ్యాకల్టీ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాం, ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతో పాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను సులభతరం చేయవచ్చునన్నారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ – ఎన్ఏఏఆర్ఎం డైరెక్టర్, ఏ–ఐడియా ప్రెసిడెంట్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు.

పంట నష్టపరిహారంలో రూ.17.50లక్షల కుంభకోణం

- అనర్హులకు కేటాయించిన అధికారులు
- దర్యాప్తు చేసి నగదు రాబట్టిన ఉన్నతాధికారులు



మేడికొండూరులో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

మేడికొండూరు: మేడికొండూరు మండల పరిధిలోని వెలవర్తిపాడు మేడికొండూరు, సిరిపురం గ్రామాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన 108 మంది రైతులను గుర్తించి 265 ఎకరాల్లో పత్తి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ. 26.50 లక్షలు నష్టపరిహారం మంజూరు చేసింది. మంజూరు చేసిన మొత్తం సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో కాకుండా అనర్హులకు కేటాయించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా అధికారులు విచారించగా విస్తుపోయే వాస్తవాలు బయటకు వచ్చాయి. వెలవర్తిపాడు, మేడికొండూరు, సిరిపురం గ్రామాల్లో రూ. 17.50లక్షల కుంభకోణం జరిగినట్లు అధికారులు నివేదికలో వెల్లడించారు. వివిధ ఖాతాల్లోకి జమ అయిన సొమ్మును అధికారులు రాబట్టారు. 41 మంది రైతుల వద్ద నుంచి అనర్హులకు కేటాయించిన నగదును జిల్లా అధికారులు వారం రోజులుగా విచారణ చేసి రికవరీ చేశారు.

బైపాస్ రోడ్డెక్కిన మొసలి

పిడుగురాళ్ల: పట్టణంలోని బైపాస్‌పై బుధవారం తెల్లవారుజామున మొసలి రోడ్డెక్కింది. లారీలకు, వాహనదారులకు రోడ్డుకు అడ్డంగా మొసలి కనిపించటంతో వాహనదారులు బెంబేలు ఎత్తారు. దీంతో కొంత సమయం పాటు వాహనాలు కొంత సమయం నిలిపివేశారు. రోడ్డు బైపాస్ రోడ్డు దాటి మడుగులోకి వెళ్లటంతో వాహనాలు యథావిధిగా వెళ్లారు. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ డెప్యూటీ రెంజ్ ఆఫీసర్ వీరేశలింగంతోపాటు సిబ్బంది హాజరై మొసలి తిరిగిన ప్రాంతాలను పరిశీలించారు. మొసలి ఆచూకీ దొరకపోవటంతో ఫారెస్ట్ అధికారులు మొసలిని పట్టుకునేందుకు బైపాస్ రోడ్డులోని రిక్షా కాలనీ సమీపంలో మడుగు ఉన్న ప్రాంతంలో ట్రాప్ గేజ్‌ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్ స్వాధీనం

గురజాల రూరల్: మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం....మండల పరిధిలోని మాడుగుల గ్రామంలో స్తంభాల బోడులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారనే ఆరోపణలతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆ ప్రాంతంలో ఉన్న మూడు ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.